క్లుప్తంగా

అంజన్నకు ప్రత్యేక పూజలు



అలంకరణలో ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు అంజన్నకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి, తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

టవర్ ఏర్పాటుకు స్థలం కేటాయింపు

వజ్రకరూరు: మండలంలోని ఎన్‌ఎన్‌పీతండా గ్రామంలో బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ టవర్ ఏర్పాటుకు అధికారులు స్థలం కేటాయించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో టవర్ ఏర్పాటుకు ఐదు సెంట్ల స్థలాన్ని కేటాయిస్తూ తహసీల్దార్ అనిల్‌కుమార్ ఉత్వర్వులను బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులకు అందజేశారు.

దృష్టిలోపం నివారణకే 'కంటి వెలుగు'



విద్యార్థి దృష్టి శాతాన్ని పరీక్షిస్తున్న కంటి వైద్యుడు భాస్కర్

బొమ్మనహాళ్: దృష్టిలోపాన్ని నివారించడానికే రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందని కంటి వైద్యుడు భాస్కర్, శ్రీధరఘట్ట పీహెచ్‌సీ వైద్యాధికారిణి గీతాభార్గవి తెలిపారు. శనివారం మండలంలోని శ్రీధరఘట్ట ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో కంటి వెలుగు పథకంలో భాగంగా 40 మందికి దృష్టి శాతాన్ని పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. కంటి చూపు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ భారతి, సూపర్‌వైజర్ ఉమాదేవి, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పట్టాభిషేక వేడుకలు ప్రారంభం



అలంకరణలో మూలవిరాట్

వజ్రకరూరు: మండల కేంద్రంలో శనివారం కుమ్మగొండ బండయ్యస్వామి మహాసామ్రాజ్య పట్టాభిషేక వేడుకలు వైభవంగా ప్రారంభించారు. ఉదయం కుమ్మగొండబండయ్య స్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మంద కలియుట కార్యక్రమం చేపట్టారు. ఆదివారం ఉదయం గంగపూజ, నల్లబంబడిపూజ, పటముపూజ, కామక్క కథ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కురువ కుమ్మగొండ బ్యాళ్ల వంశీయులు తెలిపారు. సోమవారం పోంజుపూజ, అరికి బండారు కార్యక్రమాలు చేపడతామన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



పౌష్టికాహారాన్ని అందజేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీడీపీఓ లక్ష్మీప్రసన్న హెచ్చరించారు. మండలంలోని గోళ్ల గ్రామంలో శనివారం అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు, బాలింతులు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. సెంటర్‌లో హైరిస్క్ గర్భిణుల వివరాలు, అనీమియా ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఓబుళమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న పాలనలో సంక్షేమ వెలుగులు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీ మంగమ్మ

కంబదూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకూ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమె కొనియాడారు. శనివారం మండలంలోని పాళ్లూరు గ్రామంలో ఎమ్మెల్సీ మంగమ్మతో కలిసి మంత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎవరికీ సాధ్యంకాని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అబద్ధపు హామీలతో ప్రజలను వంచించడానికి మాజీ సీఎం చంద్రబాబు మళ్లీ వస్తారని, ఎట్టి పరిస్థితిల్లోనూ నమ్మరాదన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, మండల కన్వీనర్ బాలరాజు, సచివాలయాల మండల కన్వీనర్ సాకే గంగాధర్, సర్పంచ్‌లు లక్ష్మీదేవి, శివ, చెన్నయ్య, వైస్ ఎంపీపీ తిమ్మరెడ్డి, ఎంపీటీసీ మారెన్న, నాయకులు ఐపార్సుపల్లి వెంకటేశులు, కాశీరెడ్డి, లోకనాథ్‌రెడ్డి, కిష్టప్ప, వడ్డే గోవిందప్ప, అశోక్, డాక్టర్ నాగరాజు, పర్వతప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

కళ్యాణదుర్గం: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ మండలంలోని మల్లికార్జునపల్లి, హులికల్లు గ్రామాల్లో ఆదివారం పర్యటించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు మల్లికార్జునపల్లి, సాయంత్రం 4 గంటలకు హులికల్లు గ్రామంలో నిర్వహించే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని వారు కోరారు.

ఉపాధి పనుల పరిశీలన

బ్రహ్మసముద్రం: ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ వెంకట నాయుడు, ఏపీఓ అప్పస్వామినాయుడు శనివారం పరిశీలించారు. మండలంలోని నంజాపురం, పిల్లలపల్లి గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. అనంతరం మస్టర్లను తనిఖీ చేసి కూలీల హాజరును పరిశీలించారు. కూలీలకు పనికి తగ్గ వేతనం అందించాలని, వేసవిలో సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు.

బైకును ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

కళ్యాణదుర్గం: మండలంలోని గోళ్ల గ్రామంలో అనంతపురం వైపు నుంచి కళ్యాణదుర్గం వస్తున్న హైయర్ ఆర్టీసీ బస్సు శనివారం సాయంత్రం బైకును ఢీ కొంది. కళ్యాణదుర్గం డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు కళ్యాణదుర్గానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న బైకును ఢీ కొంది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన యువకులు చిన్నా, అశోక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సమ్మర్ క్యాంపు సద్వినియోగం చేసుకోండి



ఉరవకొండ: పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంఈఓ, గ్రంథాలయ అధికారి



కంబదూరు: పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్‌ఐ రాజేష్, నాయకులు

ఉరవకొండ/కంబదూరు: ఉరవకొండ పట్టణంలోని ప్రధాన గ్రంథాలయ శాఖలో ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకూ 35 రోజుల పాటు జరిగే వేసవి విజ్ఞాన శిబిరాలు(ఉచిత సమ్మర్ క్యాంపులను) సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఈశ్వరప్ప సూచించారు. శనివారం స్థానిక ఎమ్మార్సీలో సమ్మర్ క్యాంపు పోస్టర్లను గ్రంథాలయ సీనియర్ అధికారి వై.ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంఈఓతో పాటు ఉపాధ్యాయులు విడుదల చేశారు. అలాగే కంబదూరు గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు పోస్టర్లను ఎస్‌ఐ రాజేష్, సచివాలయాల మండల కన్వీనర్ సాకే గంగాధర్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నీలి శంకరప్ప విడుదల చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ ఈడిగ పవన్, నాయకులు బడిగి హనుమంతరాయుడు, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై వేంకటరమణుడు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారు భక్తులకు శేషవాహనంపై దర్శనమిచ్చారు. సాయంత్రం శ్రీవారిని శేషవాహనంపై ఊరేగించారు. అంతకుముందు ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. కార్యక్రమంలో కుర్నిశెట్టి సంఘం సభ్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, ఈఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఆదివారం హనుమద్ వాహనోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేయాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో కార్మికులు, వైద్య సిబ్బంది పట్ల నియంతలా వ్యవహరిస్తూ వేధింపులకు గురి చేస్తున్న ఆస్పత్రి ఆఫీస్ సూపరెంటెండెంట్ రాంప్రసాద్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆఫీస్ సూపరింటెండెంట్ విధులు సక్రమంగా నిర్వర్తించకుండా సిబ్బంది, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తూ తొలగిస్తామని, బదిలీ చేస్తానని బెదిరిస్తున్నారన్నారు. ఆస్పత్రి వైద్యాధికారి, జిల్లా అధికారులు స్పందించి ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు.

ఎస్‌ఐకి సన్మానం

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ ఎస్‌ఐ రంగడుయాదవ్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అందరి సహకారంతో మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. కర్ణాటక మద్యం రవాణాపై నిఘా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



కళ్యాణదుర్గం: గోళ్లలో హౌసింగ్ లే అవుట్‌ను పరిశీలిస్తున్న అధికారులు



బొమ్మనహాళ్: సిద్దరాంపురంలో జగనన్న కాలనీని పరిశీలిస్తున్న మండల అధికారులు



వజ్రకరూరు: జగనన్న కాలనీలో పర్యటిస్తున్న అధికారులు

కళ్యాణదుర్గం: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని మండల ప్రత్యేక అధికారిణి, సీడీపీఓ లక్ష్మీప్రసన్న సూచించారు. మండలంలోని గోళ్ల గ్రామంలో శనివారం హౌసింగ్ డీఈ శైలజ, ఎంపీడీఓ బాలాజీ, ఏఈ లోక్‌నాథ్ చౌదరితో పాటు సచివాలయ సిబ్బంది పేదలకు పంపిణీ చేసిన ఇంటి స్థలాల లే అవుట్‌ను పరిశీలించారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లను నిర్మించుకోవడానికి సహకరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోళ్ల మోహన్‌రెడ్డి, గోపాల్, కో ఆప్షన్ సభ్యుడు రెహ్మాన్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: జగనన్న కాలనీల్లో గృహాలు త్వరగా నిర్మించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ షకీలాబేగం సూచించారు. శనివారం మండలంలోని సిద్దరాంపురం గ్రామంలోని జగనన్న కాలనీని పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుక, సిమెంట్, స్టీల్ తదితర సామాగ్రి అందించడంతో పాటు సకాలంలో బిల్లులు మంజూరు చేస్తుందన్నారు. విద్యుత్,నీటి సౌకర్యం కల్పించామని, వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజినేయులు, ఎంపీటీసీ వెంకటేశులు, పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: పేదవాడి సొంతింటి కలను నేరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ అనిల్ కుమార్, సర్పంచు మోనాలిసా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో అధికారులు పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకోవాలని సూచించారు. అనంతరం కొనకొండ్ల గ్రామంలోని జగనన్న కాలనీల్లో అధి కారులు పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల ఇంజినీర్ మణి భూషణ్, ఆర్‌డబ్ల్యూస్ అధికారి దాక్షాయణి, హౌసింగ్ ఏఈ చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధ్యాత్మిక బోధన

రాయదుర్గంటౌన్: స్థానిక నేసేపేటలోని ఎప్రార్థ ప్రార్థన మందిరంలో దాదాపు 500 మంది పిల్లలకు మంచి నడవడికలో శిక్షణతోపాటు ఆధ్యాత్మికత బోధన నిర్వహించారు. సోమవారం నుంచి శనివారం వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాస్టర్ సమూయేలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సండే స్కూల్ పేరిట చిన్నారులతో ర్యాలీ నిర్వహించామన్నారు.

హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కణేకల్లు: కణేకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న నాలుగు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు సీడీపీఓ యల్లమ్మ తెలిపారు. రచ్చుమర్రి అంగన్‌వాడీ హెల్పర్ (ఓసీ), దేవగిరి-2 (బీసీ-ఏ), సింగేపల్లి (బీసీ-బీ), గోవిందవాడ (ఓసీ)లో ఖాళీ ఉన్నాయన్నారు. ఈనెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదోతరగతి ఉత్తీర్ణులై, స్థానికంగా ఉన్న వివాహితులు హెల్పర్ పోస్టులకు అర్హులన్నారు.

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం: 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ విద్య కోసం ఆర్డీటీ నిర్వహించే ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ రీజినల్ డైరెక్టర్ లక్ష్మణరావు, ఏటీఎల్ మీనాక్షి కోరారు. ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో 500 మార్కులు పైగా సాధించిన విద్యార్థినీ విద్యార్థులు ఆర్డీటీ సెట్ రాయడానికి అర్హులన్నారు. ఈనెల 11 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. దరఖాస్తుతో పాటు మార్కుల జాబితా, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్ ఫొటోలు జతచేయాలన్నారు. దరఖాస్తులు ముదిగల్లు రోడ్డులోని ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు.

బ్యాంకు మేనేజర్‌కు సన్మానం



మేనేజర్ గోపీని సన్మానిస్తున్న ఖాతాదారులు

కుందుర్పి: బదిలీ అయిన మండలంలోని మలయనూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ గోపిని గ్రామస్తులు, మహిళా సంఘ సభ్యులు, ఖాతాదారులు ఘనంగా సన్మానించారు. ఆయన స్థానంలో లేపాక్షి నుంచి వచ్చిన కొత్త మేనేజర్ నరసింహారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి సర్పంచ్ గోవిందమ్మ, ఖాతాదారులు నరసింహులు, ఎరిస్వామి, మల్లేష్, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

14న కంటి వైద్యశిబిరం

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్రాహ్మణి సోషల్ వెల్ఫేర్ రూరల్ డెవలప్‌మెంట్, ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో శాంతిరాం ఆసుపత్రి వారి సహకారంతో ఈ నెల 14న ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇండియన్‌రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరవుతారన్నారు. మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

పదో తరగతి ఫలితాల్లో విద్యార్థుల సత్తా

రాయదుర్గంటౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. గత ఏడాది కంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించారు. దాదాపు 22 శాతం ఉత్తీర్ణత అధికంగా నమోదై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శభాష్ అనిపించారు. రాయదుర్గం పట్టణంలోని ఐదు మున్సిపల్ పాఠశాలలు, ఐదు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న మొత్తం 10 పాఠశాలల్లోని 795 మంది విద్యార్థులకు 487 మంది విద్యార్థులు ఉతీర్ణత (61.26 శాతం) సాధించారు. వీరిలో 309 మంది బాలికలు, 178 మంది బాలురు ఉత్తీర్ణత సాధించగా బాలికలదే పైచేయిగా నిలిచింది.

పాఠశాలల వారిగా ఉత్తీర్ణత వివరాలు

పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో 213 మందికి గాను 141 మంది ఉత్తీర్ణత (66 శాతం), సాధించగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 121 మందికి 53 మంది(44 శాతం), కేజీబీవీలో 36 మందికి 30 మంది(83 శాతం), ఉర్దూ ఏయిడెడ్ స్కూల్‌లో 12 మందికి గాను 11 మంది(91 శాతం), ఏపీ మోడల్ స్కూల్‌లో 95 మందికి గాను 77 మంది (81 శాతం), బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్‌లో 80 మందికి గాను 47 మంది (59 శాతం), కల్లీమఠం మున్సిపల్ హైస్కూల్‌లో 89 మందికిగాను 48 మంది (54 శాతం), రాధాకష్ణ మున్సిపల్ హైస్కూల్‌లో 54 మందికి గాను 26 మంది(48 శాతం), అభ్యుదయ మున్సిపల్ హైస్కూల్‌లో 38 మందికి 8 మంది (21 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని ప్రైవేటు స్కూళ్లలో పది ఫలితాల్లో 91.85 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఏడు ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 270 మందికి గాను 248 మంది పాసయ్యారు. సెయింట్ పాల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 100 మందికిగాను 92 మంది, విద్యార్థి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 10 మందికి ఆరుగురు, పీఎస్ఆర్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 30 మందికి గాను 28 మంది క్రిసెంట్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 25 మందికి గాను 22 మంది, ఏవీఆర్ 36 మందికి గాను 34 మంది, సెయింట్ థామస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 51 మందికి గాను 50 మంది, శ్రీవాణి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో 18 మందికిగాను 16 మంది ఉత్తీర్ణులయ్యారు.

బొమ్మనహాళ్: పదో తరగతి పరీక్షల్లో మండలంలో 50.1 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ తిమ్మప్ప, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 705 మంది విద్యార్థులుండగా 687 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 343 మంది విద్యార్థులు పాసయ్యారు. మిగిలిన 344 మంది విద్యార్థులు ఫెయిలవ్వగా 18 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు.

డి హీరేహాళ్(రాయదుర్గం): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అమ్మాయిలేపై చేయి సాధించారు. డి హీరేహాళ్ మండలంలోని 11 ఉన్నత పాఠశాలల పరిధిలో 577 మంది విద్యార్థులుండగా 571 మంది పరీక్షలు రాశారు. ఇందులో 124 మంది బాలురు, 181 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 53 శాతం ఫలితాలు రాబట్టారు.

గుమ్మఘట్ట: పదో తరగతి పరీక్షల్లో బాలికలు ఉత్తమ ఫలితాలు సాధించి బాలురకంటే పైచేయి సాధించారు. మండలవ్యాప్తంగా తొమ్మిది జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఎంజేబీ గురుకుల పాఠశాలల్లో 504 విద్యార్థులుండగా 501 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇందులో 272 మంది విద్యార్థులు ఉత్తీర్ణులు కావడంతో 54.49 శాతం ఉత్తీర్ణత సాధించినటుల్ ఇన్‌చార్జ్ ఎంఈఓ నాగమణి తెలిపారు. ఎంజేబీగురుకుల పాఠశాలలో 75 మంది విద్యార్థులకుగానూ 63 మంది ఉత్తీర్ణులవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు.

కణేకల్లు: మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. పదిలో 59.05 శాతం బాలికలు ఉత్తీర్ణత సాధిస్తే.. బాలురు 53.03 శాతం ఉత్తీర్ణ సాధించారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 899 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 502 మంది ఉత్తీర్ణులైనట్లు అధికారులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరిసిన విద్యా కుసుమాలు

కళ్యాణదుర్గం: పది పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ మార్కులు సాధించారు. కళ్యాణదుర్గం మండలంలోని ఏపీ మోడల్ పాఠశాలలో మొత్తం 83 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 46 మంది పాసై 55.42 శాతం ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీలో 39 మంది పరీక్షలు రాయగా 17 మంది పాసయ్యారు. మండలంలోని 13 జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాలల్లో 803 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 317 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలం మొత్తం 58 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ విజయ కుమారి తెలిపారు.

శెట్టూరులో....

శెట్టూరు ఏపీ మోడల్ పాఠశాలలో మొత్తం 72 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 57 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా పాఠశాలలో 79.16 శాతం ఫలితాలు సాధించారు. కేజీబీవీలో 34 మంది విద్యార్థులు పరీక్షలుగా రాయగా 24 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే మండల వ్యాప్తంగా 12 ప్రభుత్వ పాఠశాలలుండగా మొత్తం 445 విద్యార్థులు పరీక్షలు రాయగా 250 మంది ఉత్తీర్ణత సాధించారు. 56 శాతం ఫలితాలు సాధించినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు.

కంబదూరు: మండల వ్యాప్తంగా 418 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 234 మంది విద్యార్థులు పాసయ్యారు. 56 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 80 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 71 మంది విద్యార్థులు పాసయ్యారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను ప్రిన్సిపాల్ సత్యవతమ్మ , సిబ్బంది అభినందించారు.

బాలికలదే పైచేయి

ఉరవకొండ: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో బాలికలు పైచేయి సాధించారు. శనివారం విడుదల అయిన ఫలితాల్లో వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో 97.4శాతం ఉత్తీర్ణత సాధించారు. ఉరవకొండ ఎస్సీ గురుకుల పాఠశాలలో 84.8 ఉత్తీర్ణత శాతం సాధించారు. చిన్నముస్టూరు మోడల్ స్కూల్‌లో 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండల వ్యాప్తంగా 969 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా 470 మంది ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప తెలిపారు. అలాగే పట్టణంలోని శ్రీవివేకానంద ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 103 మంది పరీక్షలకు హాజరు కాగా 101 మంది ఉత్తీర్ణత సాధించగ ఇందులో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 45 మంది ఉండటం విశేషం.

వజ్రకరూరు: మండలంలో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 48 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ ఎర్రి స్వామి తెలిపారు.శనివారం వజ్రకరూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వజ్రకరూరు మండలంలో మొత్తం 610 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 296 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. వజ్రకరూరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 50 శాతం ఉత్తీర్ణత, మోడల్ స్కూల్‌లో 68 శాతం , కస్తురిబా విద్యాలయంలో 68శాతం, రాగులపాడు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 45 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే వెంకటాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 57 శాతం, రాగులపాడు గురుకుల పాఠశాలలో 62 శాతం, కొనకొండ్ల జెడ్పీహెచ్‌ఎస్ 36 శాతం, చాబాల జెడ్పీహెచ్‌ఎస్ 43 శాతం, చిన్నహోతురు జెడ్పీహెచ్‌ఎస్‌లో 51 శాతం, పీసీ.కొత్తకోట జెడ్పీహెచ్‌ఎస్‌లో 50శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ తెలిపారు.

బెళుగుప్ప: మండలంలోని కేజీబీవీ పాఠశాలలో 23 మంది విద్యార్థులకు గాను 18 మంది ఉత్తీర్ణులై 78 శాతం సాధించింది. బెళుగుప్పలోని శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులు వందశాతం పాసయ్యారు. మండలం మొత్తం 408 మంది విద్యార్థులకు గాను 207 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ మల్లారెడ్డి తెలిపారు.

స్త్రీనిధి అవకతవకలపై విచారణ చేపట్టండి

ఉరవకొండ: ఉరవకొండ వైఎస్సార్ క్రాంతి పథంలో కొంతమంది సీసీలు, యానిమేటర్లు స్త్రీనిధి రుణాలు రికవరీలో అవకతవకలకు పాల్పడ్డారని, సమగ్రంగా విచారణ చేపట్టి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఉరవకొండ ఎంపీపీ చందా చంద్రమ్మ తదితరులు కలెక్టర్ గౌతమిని కోరారు. శనివారం అనంతపురంలోని జెడ్పీ భవనంలో నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఉరవకొండ వైకేపీలో జరిగిన అవినీతిని కలెక్టర్ దృష్టికి ఎంపీపీ తీసుకెళ్లారు. మహిళలు గ్రామైఖ్య సంఘాల్లో స్త్రీనిధి రుణం చెల్లించి రసీదులు కూడా పొందారని, అయితే కొంతమంది సీసీలు, యానిమేటర్ల చేతివాటం ప్రదర్శించి దాదాపు రూ.30 లక్షల వరకూ బ్యాంకులకు రుణాలు చెల్లించకుండా దిగమింగారన్నారు. స్పందించిన కలెక్టర్ అక్కడే ఉన్న డీఆర్‌డీఏ పీడీతో పాటు ఇతర అధికారులను అక్రమాలపై సమగ్రంగా విచారణ చేపట్టి బాధ్యుల పై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

15న ఉచిత ఖత్నా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న మదరసా జామియా అన్వారుల్ ఉలుమ్ నందు అంజుమన్ అజ్మతుల్ ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉచిత ఖత్నా(వడుగులు) నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బ్రెడ్ సర్మాస్, లడ్డు మహమ్మద్ షఫీ తెలిపారు. ఈ మేరకు శనివారం కమిటీ సభ్యులు వివరాలు వెల్లడించారు. పట్టణంతోపాటు పరిసర గ్రామాలు, నియోజకవర్గ పరిధిలో నిరుపేదలు తమ పిల్లలకు ఉచిత ఖత్నా చేయించేందుకు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 12వ తేదీలోపు తమ పిల్లల పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పేర్ల నమోదు, ఇతరాత్ర సమాచారం కోసం 9177442220 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు జగులూరు బాష, సహాయ కార్యదర్శి హుజేఫా, కోశాధికారి అహ్మద్ హుస్సేన్, సభ్యులు డ్రైవర్ బాషా, ఖాసీం, ఉమ్రలి, రజాక్, షేక్ జాకిర్, షాకిర్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

రాయదుర్గం డివిజన్

9010470185, 9010006852, 9010223701